మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే రచ్చబండ

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జూలై 15: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ రామగుండం రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సోమవారం 9వ డివిజన్ జనగామలోని రామగుండం రచ్చబండ కార్యక్రమాన్ని చందర్ ప్రారంభించారు. అనంతరం ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగానికి నోటిఫికేషన్ ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిరుద్యోగులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి దత్తత గ్రామం జనగామలో ప్రజలకు సకల వసతులు కల్పించాలని లేని పక్షంలో జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ సందర్భంగా సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని తీర్మానించారు. ఇక్కడ మున్సిపల్ కార్పొరేటర్ జనగామ కవిత సరోజన, బీఆర్ఎస్ నాయకులు జనగామ నర్సయ్య, నారాదాయణదాసు మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, సట్టు శ్రీనివాస్, ఓదెలు, కిరణ్, వడ్లకొండ మహేందర్, వెంకటేశ్, ఆవునూరి వెంకటేశ్, సొమ్మిడి రాము, దసారపు వేణు ఉన్నారు.

ఏకపక్షంగా సింగరేణి క్వార్టర్ల కూల్చివేత

మాట్లాడుతున్న కౌశిక హరి

గోదావరిఖని, జూలై 15: గత 50 ఏండ్లగా తండ్రుల నుంచి కొడుకుల వరకు ఉంటున్న సింగరేణి నివాస క్వార్టర్ల కూల్చివేత ఏకపక్ష నిర్ణయమని బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి, తోట వేణు ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి పేరిట సింగరేణి క్వార్టర్ల కూల్చివేత విధ్వంసం సృష్టించడంతో కార్మిక కుటుంబాల్లో భయాందోళన నెలకొందన్నారు. రోడ్డు వెడల్పు పేరిట గోదావరిఖని పట్టణ చౌరస్తా ఏరియా నుంచి చేపడుతున్న క్వార్టర్ల కూల్చివేత స్థలంలో ఎలాంటి అభివృద్ధి నిర్మాణాలు చేపడుతారో ప్రజలకు ఎందుకు స్పష్టంగా చేపట్టడం లేదన్నారు. చట్టబద్ధత లేకుండా సింగరేణి క్వార్టర్లలో కరెంటు సరఫరాను నిలివేశారన్నారు. సరఫరా నిలుపుదలపై చేపట్టిన ఆదేశాలను కార్మికులకు తెలుపాలన్నారు. అసలు క్వార్టర్ల కూల్చివేత వెనుక ప్రభుత్వ యంత్రాంగం ఆదేశాలు జారీ చేసిందా లేదా సింగరేణి లేక స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. బడుగు బలహీన వర్గాలు అధికంగా ఉన్న క్వార్టర్లలోనే ఈ విధ్వంసం జరుగుతోందన్నారు. ఈ క్వార్టర్స్ కోల్పోతున్న బాధితుల్లో 25మంది దళితులు ఇప్పటికి ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించగా సింగరేణిపై కేసునమోదు జరిగినట్లు వివరించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కార్మికులను కార్మిక కుటుంబాలను ఇబ్బంది పెట్టవద్దని, క్వార్టర్ల తొలగింపుపై ఆలోచన చేయాలన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, జూలై15: మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తూ, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మత్తు పదార్థాల నివారణకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారంపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఏసీసీ జీ కృష్ణ, డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం

పెద్దపల్లి, జూలై15: ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ, ప్రజావాణి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచరాదని ఆదేశించారు. జిల్లా, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

మంథని, జూలై 15: పట్టణంలోని ఫర్టిలైజర్స్ షాపులను పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లో ఉండే ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలను ఆయన తనిఖీ చేయడంతో పాటు స్టాక్ రికార్డులను పరిశీలించారు. షాపుల నిర్వాహకులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులను విక్రయించాలని సూచించాలని, ధరలతో కూడిన పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఏవో మోహన్ ఉన్నారు.

కమాన్‌పూర్ జూలై 15: కమాన్‌పూర్ పీఏసీఎస్ కార్యాలయం, పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. రికార్డులో ఉన్న స్టాక్, గోదాములో ఉన్న సరుకులను సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అ ఆయన వెంట పీఏసీఎస్ సీఈవో సంతోష్ తదతరులున్నారు.

జూలపల్లి, జూలై 15 : జూలపల్లిలో విత్తన, ఎరువుల దుకాణాలు, సింగిల్ విండో గోదాంలో సోమవారం ఏవో ప్రత్యూష తనఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, రికార్డులు, స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. మండలంలో ప్రస్తుతం 120.195 మెట్రిక్ టన్నుల యూరియా, 30.65 మెట్రిక్ టన్నుల డీఏపీ, 167.05 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 5.7 మెట్రిక్ టన్నుల పొటాష్ నిల్వలు ఉన్నాయని వెల్లడించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రామగిరి, జూలై 15: మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్ తనిఖీ చేపట్టారు. రికార్డులో ఉన్న స్టాక్, గోదాములో ఉన్న సరుకులను సక్రమంగా ఉన్నాయా? లేవా అని పరిశీలించారు. వ్యాపారులు ఎరువులు, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో హెచ్చరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ముత్తారం, జూలై 15: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి అమరేందర్ రావు సూచించారు. మచ్చుపేట గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, జ్వర పీడితులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. గ్రామ ప్రత్యేక అధికారి వరలక్ష్మీ, గ్రామ కార్యదర్శి సంధ్య ఉన్నారు.

మంథనిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- రూ.4కోట్లతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌కు 15రోజుల్లో శంకుస్థాపన
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని : మాట్లాడుతున్నమంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూలై 15: రాష్ట్రంలోనే మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణ వాసుల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ. 12. 10 కోట్లతో అమృత 2.0 పథకం కింద స్థానిక పోచమ్మ వాడలో 8లక్షల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్, 25కిలో మీటర్ల పైపులైన్ నిర్మాణ పనులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమృత 2.0 ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. రూ. 4కోట్ల నిధులతో ఆధునాతన హంగులతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మించేందుకు తలపెట్టామన్నారు. మున్సిపల్ భవన నిర్మాణ పనులకు సైతం 10 రోజుల్లో శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. డంప్ యార్డు సమస్య పరిష్కారానికి కోసం రూ. 2కోట్లతో ఎక్లాస్‌పూర్ శివారులో షెడ్లను నిర్మిస్తామన్నారు. మంథని అభివృద్ధికి అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. పట్టణంలో నూతనంగా పైపు లైన్ వేసి రెండు వేల ఇండ్లకు నల్లా కనెక్షన్లు అందించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.

ప్రతీ పౌరుడు మొక్కలు నాటాలి

ప్రతీ పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోచమ్మవాడ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల బాలురలో ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీలతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేశ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కౌన్సిలర్లు కొట్టె పద్మ రమేశ్, కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర శంకర్, వీకే రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతుల వెల్లువ..

మంథనిలో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలువురు వినతులు అందించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, సీఐటీయూ నాయకుడు బూడిద గణేష్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి వినతి పత్రం అందజేశారు. సింగరేణిలో మారు పేర్లపై విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

కేజీబీవీ నూతన భవనం ప్రారంభం

రామగిరి, జూలై 15: పన్నూరులో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాన్ని మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పన్నూరులో కేజీబీవీ నూతన భవనం ప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయులకు పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు. మంథని ఆర్డీవో హను మా నాయక్, డీఈఓ మాధవి, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

మంత్రి పరామర్శ

కమాన్‌పూర్, జూలై 15: జూలపల్లిలోని ఆదర్శ నగర్‌కు చెందిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెమిని గౌడ్ తండ్రి వడ్లకొండ కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబాన్ని మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి సానుభూతి తెలిపారు.

దారి కబ్జా చేశారని ట్యాంక్ ఎక్కిన రైతు

కాల్వశ్రీరాంపూర్, జూలై15: దారి కోసం ఓ రైతు పురుగుల మందు డబ్బాతో వాటర్ ట్యాంక్ ఎక్కిన సంఘటన గంగారంలో సోమవారం చోటుచేసుకుంది. గంగారంలో రైతులు పంట పొలాలకు వెళ్లే రహదారిని గ్రామానికి చెందిన ఓ రైతు అక్రమంగా కబ్జా చేసి అటు నుంచి రైతులను వెళ్లనివ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి చెందిన రైతు అంబాల రాజేందర్ వాటర్ ట్యాంక్ ఎక్కి పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు రాజేందర్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అతను వినక పోవడంతో ఎమ్మెల్యే విజయరమణారావు రాజేందర్‌తో ఫోన్లో మాట్లాడి హామీ ఇవ్వడంతో ట్యాంక్ దిగాడు. దీంతో రాజేందర్ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుల తీరుపై ప్యాక్స్ చైర్మన్ నిరసన

మంథని, జూలై 15: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటనలో పోలీసుల తీరుపై ప్యాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ నిరసన వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మంథనిలోని పోచమ్మవాడలో అమృత 2.0 పథకం కింద వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణ పనుల శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో చేపట్టిన వన మహోత్సఆనికి బయలుదేరగా ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ సైతం తన వాహనంలో బయలుదేరారు. ఎస్ఐ వెంకటకృష్ణ శ్రీనివాస్ వాహనాన్ని నిలిపివేశారు. దీంతో కొత్త శ్రీనివాస్ కారు దిగి ఇతర మండలాలకు సంబంధించిన నాయకుల కార్లు వెళ్తుంటే తన వాహనాన్ని మాత్రం ఎందుకు ఆపుతున్నారని, వాహనాన్ని వెళ్లనీయాల్సిందిగా కోరగా ఎస్ఐ వినలేదు. సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్న తన వాహనాన్ని వెళ్లనివ్వకుండా అడ్డుపడడంతో అవమానానికి గురైన కొత్త శ్రీనివాస్ రోడ్డుపైనే బైఠాయించి ఆగ్రహంతో తన నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని చూస్తున్న తోటి కాంగ్రెస్ నాయకులు కలుగజేసుకొని కొత్త శ్రీనివాస్‌ను సముదాయించారు. దీంతో శాంతించిన శ్రీనివాస్ తన వాహనంలోనే ఎక్కి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ విషయంపై ఎస్ఐ వెంకటకృష్ణను వివరణ కోరగా వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం కారణంగా సింగిల్ విండ్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ వాహనం నిలిపి వేశామని, తిరిగి పంపించామని వివరించారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం

జ్యోతినగర్, జూలై 15: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికి సన్మానం చేశారు. ఇక్కడ కాగ్రెస్ పార్టీ నాల్గో డివిజన్ అధ్యక్షుడు బొడిగె భరత్‌గౌడ్, నాయకులు వెంగళబాపు, మెరుగు లింగమూర్తి, సట్టు ముత్యాలు, దుర్గం నర్సయ్య, పులికంటి రామకృష్ణారెడ్డి, గోలివాడ మల్లేశ్, బొర్లకుంట శివ, కటకం కుమారస్వామి ఉన్నారు.

మేజిక్ రాజాకు అవార్డు

కోల్‌సిటీ, జూలై 15ః గోదావరిఖనికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజాను విశిష్ట మెజీషియన్ అవార్డు వరించింది. ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన 40వ ఇంద్రజాల మహోత్సవం అమరావతి మేజిక్ ఫెస్టివల్‌లో మేజిక్ రాజాను ఘనంగా సన్మానించి విశిష్ట మెజీషియన్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయను పలువురు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ఆవిర్భావం

కోల్‌సిటీ, జూలై 15ః రామగుండం నియోజక వర్గంలోని స్వచ్ఛంద సేవా సంఘాలు ఒకే గొడుకు కిందకు చేరాయి. సామాజిక సేవతోపాటు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఐక్య వేదికగా ఏర్పడ్డాయి. ఈమేరకు గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో నియోజక వర్గంలోని దాదాపు 11 స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు హాజరు కాగా, స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కార్పొరేటర్ మంచికట్ల దయాకర్ , ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల రమేశ్,ఉపాధ్యక్షులుగా గోలివాడ చంద్రకళ, సహాయ కార్యదర్శిగా ముద్దసాని సంధ్యారెడ్డి, చింతకింది సంతోష్ రెడ్డి, కోశాధికారిగా మద్దెల దినేష్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు జక్కని శ్రీలత, చందు యాదవ్, అరవింద్, అణురాజ్, సుజాత, శ్రీదేవి, రమాదేవి, సరిత, లక్ష్మీ, స్వప్న, లత, శారద తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదికగా ఆవిర్భవించడం రామగుండంలో ప్రాధాన్యతను సంతరించుకున్నది.

రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

జూలపల్లి : కాచాపూర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, జూలై 15 : రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. కాచాపూర్ నుంచి లోకపేట దాకా నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఐదు కిలో మీటర్ల డబుల్ రోడ్డు పనులకు రూ. 12 కోట్ల విడుదల చేసిందన్నారు. తెలిపారు. ఆరు నెలలలోపు రహదారి పనులు పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు. కుమ్మరి కుంట నుంచి కాచాపూర్ దాకా రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. జూలపల్లి–పెద్దాపూర్ గ్రామాల మధ్య హుస్సేనిమియా వాగుపై కొత్త వంతెన నిర్మించడానికి రూ. 6.50 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించినట్లు వెల్లడించారు. ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, మాజీ జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, మాజీ సర్పంచులు బంటు ఎల్లయ్య, మాంకాలి తిరుపతి, దారబోయిన నరసింహం, కొత్త రవీందర్, సొల్లు శ్యామ్, ఆకుల రాజయ్య, బట్టు సంజీవ్, మాజీ ఎంపీటీసీలు దండె వెంకటేశం, కనుకుట్ల అంజయ్య, నాయకులు గండు సంజీవ్, ఓరుగంటి రవీందర్‌రావు, మల్లెత్తుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జూలై 15: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే విజయరమణరావు పలువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నూగిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, రమేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ పరిశీలన

కమాన్‌పూర్, జూలై 15: కమాన్‌పూర్ మండలం రొంపికుంట విద్యుత్ సబ్ స్టేషన్‌ను హెచ్ఆర్‌డీ డైరెక్టర్ అశోక్ కుమార్ సోమవారం పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గృహ జ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ రాని వారు ఉంటే ఎంపీడీవో కార్యా లయంలో సరిచేయించుకోవాలని సూచించారు. ఈశ్వర ప్రసాద్, విజయ గోపాల్, డీఈఎంఆర్ బాలయ్య, ఏఈ రాజేంద్ర కుమార్ ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దపల్లి రూరల్, జూలై 15: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. మండలంలోని పాలితంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో సుదర్శన్, జీపీ కార్యదర్శి ఉన్నారు.

గోరింటాకు సంబురాలు

జ్యోతినగర్, జూలై 15: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు సోమవారం ఎన్టీపీసీలోని టీవీ గార్డెన్‌లో గోరింటాకు సంబురాలు నిర్వహించుకున్నారు. గోరింటాకు చెట్టు ఆకులతో శ్రీ కృష్ణుడు, లక్ష్మీ అమ్మవార్లకు గౌరీ పూజ నిర్వహించిన మహిళలు అనంతరం గోరింటాకు ఆకులను మొత్తగా చేసి మైదాకును అరచేతులకు పెట్టుకోని ఆట పాట లతో అలరింప చేశారు. ఇక్కడ ఎన్టీపీసీ కృష్ణనగర్‌కు చెందిన మహిళలు సీహెచ్ రాణి, శ్యామల, దేవి, శ్రీదేవి, రాజేశ్వరి, శ్రీలత, అనిత, తదితరులు ఉన్నారు.

గౌరీ పూజలో మహిళలు

అల్లీపూర్‌లో వైద్యశిబిరం

సుల్తానాబాద్ రూరల్,జూలై 15: అల్లీపూర్‌లో డాక్టర్ అనుదీప్, గ్రామపంచాయతీ కార్యదర్శి , సిబ్బందితో కలిసి పర్యటించారు. డెంగీ, మలేరియా జ్వరాలపై ఆరా తీసి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ఒకే కేసుకు రెండు ఎఫ్ఐఆర్‌లు

- ఎస్సీ, ఎస్టీ, భూ కబ్జా కేసులో గోదావరిఖని పోలీసుల తీరు

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 15: ఎస్సీ, ఎస్టీ భూ కబ్జాకు సంబంధించి పోలీసులు ఒకే కేసుకు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడైన వడ్డెపల్లి రాంచందర్‌కు చెందిన జనగామ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 595లో 2420 చదరపు గజాల ఖాళీ స్థలం మార్కండయకాలనీలో ఉంది. భూమిలో ఫెన్సింగ్ వేసి ఉండగా, ఈ నెల 10న కొంత మంది దౌర్జన్యం చేసి ఆక్రమించేందుకు ప్రయత్నించారని రాంచందర్ కుమార్తె చిలక భారతి ఈ నెల 11న గోదావరిఖని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు క్రైమ్ నెంబర్ 351/2024 కింద నూతన బీఎన్ఎస్ చట్టంలో లేని 493, 467తో పాటు 330, 351(2) రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్‌తో పాటు 3(1)(ఆర్)(ఎస్). 3(2)(వీఏ) ఆఫ్ ఎస్సీ ఎస్టీ పీఓఏ యాక్ట్ 2005 కింద కేసు నమోదు చేశారు. తిరిగి మళ్లీ అదే కేసుకు నూతన బీఎన్ఎస్ చట్టం ప్రకారం 329(3), 324(4), 296(బీ), 351(2) ఆర్/డబ్ల్యూ 3(5)బీఎన్ఎస్ సెక్షన్ 3(1)(ఆర్)(ఎస్),3(2)(వీఏ) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ(పీఓఏ) కింద కేసు నమోదు చేశారు. అయితే రెండు ఎఫ్ఐఆర్‌లు కోర్టుకు రావడం, సాక్షాత్తూ ఎస్సీ కమిషన్ సభ్యుడి భూమి విషయంలో ఇలాంటి ఘటన జరగడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవ పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జూలై 15: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆది, సోమవారాల్లో వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో పెద్దపట్నం వేసిన ఒగ్గు పూజారులు కేతమ్మ, శివుడు, పార్వతి జీవిత గాథలను కథా రూపంలో వివరించారు. ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. నిప్పుకణికలపై భక్తులు నడిచారు. హిజ్రాలు బోనం ఎత్తుకొని నృత్యాలు చేయడాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. పొత్కపల్లి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల నుంచి వేదపండితులు వచ్చారు. వేదపండితులు మఠం భద్రయ్య, దూపం వీరభద్రయ్య, భవానీప్రసాద్, పంచాక్షరి, గంగాధర్, అభిషేక్ పూజలు నిర్వహించారు.

పు